క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



గురుకుల విద్యార్థులకు సూచనలు చేస్తున్న మోటివేషనల్ స్పీకర్ మహేంద్ర

సి.బెళగల్: విద్యార్థులు భవిష్యత్ కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మోటివేషనల్ స్పీకర్ మహేంద్ర అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ చింతలయ్య అధ్యక్షతన ఇంపాక్ట్ ఇంటర్‌నేషనల్ స్థాపకులు గంపా నాగేశ్వరరావు ఆదేశాలతో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. మహేంద్ర మాట్లాడుతూ.. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుని, వాటి సాధన కోసం కష్టపడి చదవాలన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యతులో మంచి స్థాయిలో ఉండాలంటే చదువులపై ఏకాగ్రత అవసరం అని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

జాబ్ కార్డులపై గ్రామ సభ

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా శ్రామికులకు (కూలీలకు) జారీ చేసే జాబ్‌కార్డులపై మండల ఉపాధిహామీ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. శుక్రవారం గ్రామ సచివాలయం – 2లో ఉపాధి హామీ జేఈ రంగస్వామి గ్రామ సభను నిర్వహించగా, ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ డీఆర్పీ లక్ష్మన్న సభలో జాబ్ కార్డులపై నివేదికను చదివారు. గ్రామంలో మొత్తం 2766 జాబ్‌కార్డులు ఉండగా 2462 యాక్టివ్‌గా ఉన్నాయని డీఆర్పీ తెలిపారు. ఒక కుటుంబానికి రెండు చొప్పున ఉన్నవి మొత్తం 13 ఉన్నాయని, వాటిపై విచారించి తొలగించడం జరుగుతుందని డీఆర్పీ తెలిపారు. గ్రామ సభలో టీఏ ఉమామహేశ్వరి, ఎఫ్‌ఏలు, సచివాలయ ఉద్యోగులు, మేటీలు, కూలీలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఏ.పెదరాయుడు విలువిద్యలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం విజయలక్ష్మీ తెలిపారు. ఈనెల 10వ తేదీ కర్నూలులోని అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో విద్యార్థి ప్రతిభ చాటినట్లు చెప్పారు. అదే తరగతికి చెందిన కె.బాలవర్ధన్ స్టాండ్‌బైగా ఎంపికై నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ హమీదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మెరుగైన భవిష్యత్



మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కల్లూరు: పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన భవిష్యత్ ఉంటుందని ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లీలావతి అన్నారు. శుక్రవారం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మ పేరిట మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీబీఓసీ ఉద్యోగి ఫణికుమార్, ఉపాధ్యాయులు మురళీధర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం



బాల లతను సన్మానిస్తున్న కళాశాల బృందం

కల్లూరు: విద్యార్థులు, ఉద్యోగ అన్వేషణలో ఉన్న వారు ప్రణాళికబద్ధంగా చదివితే తప్పని సరిగా విజయం సాధిస్తారని సివిల్స్ ర్యాంకర్ బాల లత అన్నారు. శుక్రవారం దూపాడులోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో యూపీఎస్సీ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. లక్ష్యాలను నిర్దేశించుకుని దానికి అనుగుణంగా ప్రణాళికతో ముందుకెళితే విజయం తథ్యమన్నారు. ఆమెను అధ్యాపకులు సన్మానించారు.

కొణిదేడును చుట్టుముట్టిన వరదనీరు



చెరువును తలపిస్తున్న వరి పొలం



పశువైద్యశాల చుట్టూ చేరిన నీరు



ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద..



నీటిలోనే పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

- రాకపోలకు తీవ్ర అంతరాయం
- పొలాలను ముంచిన నీరు

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు కొండల్లోనుంచి వరదనీరు గ్రామంలోకి భారీగా చేరి పొలాల మీదుగా ప్రవహిస్తోంది. దీంతో వరి పొలాలు నీటమునిగి పంటలు దెబ్బతిన్నాయి. వరి పొలాల్లో మూడడుగుల మేర నీరు నిల్వ ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున నుంచే వరదనీరు పెరగడంతో రాకపోకలు తీవ్రంగా అంతరాయమయ్యాయి. విద్యార్థులు బడికి వెళ్లేందుకు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలోని డ్రైనేజీ నీరు వెళ్లేందుకు చిన్న బ్రిడ్జి నిర్మించడంతో అది సరిపోకపోవడంతో పై నుంచి వచ్చిన వరదనీరు పొలాల్లోకి చేరి నిల్వ అయింది. పశువైద్యాశాల, పాఠశాల పరిసరాలు 2–3 అడుగుల నీటిలో మునిగిపోవడంతో సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకైన వంతెన కారణంగా ప్రతి సారి వరదల సమయంలో పంటలు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

● రహదారి ఛిద్రం..ప్రయాణం నరకం!



గుంతలమయమైన రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు ప్రధాన రహదారి ఛిద్రం కావడంతో వాహనదారులు, పాదాచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి మర్రిచెట్టు వరకు కొన్నేళ్ల క్రితం నిర్మించిన తారురోడ్డు భారీ వాహనాల తాకిడికి అక్కడక్కడ తారులేచిపోయి, గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వర్షం కురిస్తే ఆ రహదారిపై వెళ్లాలంటే వాహనదారులు ఆపసోపాలు పడాల్సిందే. ఈ మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీ రోడ్డు, ఇరువైపులా డ్రైనేజీ కాల్వలు నిర్మించడానికి కూటమి నాయకుడికి అప్పగించారు. అయితే సదరు నాయకుడు స్థలవివాదంతో పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. నిత్యం వందలాది మంది ప్రజలు, స్కూల్ బస్సులు, టిప్పర్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో పాటు భారీలోడుతో వెళ్లే లారీలు ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు దుస్థితి చూసి కొత్తవారు భీదరించుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపార దుకాణాలు, గృహాలు ఉన్నాయి. వర్షం కురిసినప్పుడు రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండడం, మిగతా రోజుల్లో రోడ్డుపై దుమ్ములేవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో దశమి మహోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరులో ఉన్న చింతలమునిస్వామి, నల్లారెడ్డిస్వామి, ఘనమద్దిలేటి స్వామి ఆలయాల్లో శుక్రవారం దశమి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వాముల వారికి సుప్రభాత సేవ, అభిషేకం, గ్రామదేవతల పూజ చేశారు. మధ్యాహ్నం మహానైవేద్యం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బిందె సేవపూజ, ఆకు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు



పోలకల్ రెగ్యులర్ స్కూల్లో సన్మానం పొందిన పదోన్నతి, బదిలీ ఉపాధ్యాయులు

సి.బెళగల్: విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలుగా నిలుస్తున్నారని ఎంఈఓ జ్యోతి అన్నారు. మండల పరిధిలోని పోలకల్ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం .. పదోన్నతి, బదిలీ అయిన 8 మంది టీచర్లకు హెచ్‌ఎం వరలక్ష్మమ్మ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. పాఠశాలలో ఎస్జీటీలుగా పని చేసి పదోన్నతి, బదిలీపై ఇతర పాఠశాలలకు వెళుతున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రేవేల శ్రీనివాసులు, పద్మజ, రాజేశ్వరి, రామకృష్ణారెడ్డి, ధనలక్ష్మి, రవికుమార్, ఝాన్సీ లక్ష్మీదేవి, పురంధరాచార్యులు సన్మానం పొందారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్ క్రిష్టారెడ్డికి వినతిపత్రమిస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

కోడుమూరు రూరల్: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ క్రిష్టారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ.. ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేల నుంచి, సమయ పాలన లేని ఒత్తిడి విధుల నుంచి తమకు విముక్తి కల్పించి తమను మాతృశాఖలకు అప్పగించాలన్నారు. సిబ్బంది సీనియార్టీ జాబితాను విడుదల చేసి క్యాడర్ అప్‌గ్రేడ్ చేయాలని, బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని, నోష్నల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, సెలవులు, పండగ సందర్భాల్లో బలవంతపు విధులను చేయించరాదని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది వెంకటేష్, బీరప్ప, అంకన్న, గౌస్, రవిప్రకాష్, ఇందు ప్రియాంక, రాజేష్, మునీంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్

కర్నూలు(రూరల్): బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిషేధ చట్టంపై మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ విజయ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పర్యవేక్షణ కమిటీలు సమర్థవంతంగా పనిచేసినప్పుడే బాల్య వివాహాలను నిర్మూలించవచ్చన్నారు. ఈ కమిటీలు 15 రోజులకోసారి సమావేశమై గ్రామాల్లో బాలబాలికల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. స్కూళ్లలో డ్రాపవుట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాల గురించి తెలిస్తే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. 18 ఏళ్లు నిండకుండానే బాలికకు వివాహం జరిగితే ఆమెను రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించి వరుడితో పెళ్లి జరిపించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లా బాలల సంక్షేమ సమితి మెంబర్ సంజీవరెడ్డి, అబ్జర్వేషన్ సూపరింటెండెంట్ హుసేన్ బాషా, తహసీల్దార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పశు సంపద వృద్ధిపై దృష్టిపెట్టాలి



పశు చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సి.బెళగల్: పాడి రైతులు పశు సంపద వృద్ధిపై దృష్టి సారించాలని కర్నూలు పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ రాజశేఖర్ సూచించారు. శుక్రవారం సి.బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామ పశు వైద్యశాలలో డాక్టర్ రోనాల్డ్ రీచర్స్ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ, ఏడీ డాక్టర్ మల్లన్న, ఎంపీపీ బొంతల మునెప్ప హాజరై పాడి రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా గ్రామానికి చెందిన 25 పశువులకు చికిత్స అందించి, ఉచితంగా మందులను అందజేశారు. పశువుల గర్భకోశ వ్యాధులపై పాడి రైతులు అడిగిన ప్రశ్నలకు గూడూరు ఏడీ డాక్టర్ శివన్న సమాధానాలు, సూచనలు ఇచ్చారు. అదేవిధంగా పశుగ్రాస వారోత్సవాల్లో సందర్భంగా రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేశారు. పాడి రైతులు, పశు వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



టీచర్ల కొరత సమస్యను ఎంఈఓ జ్యోతికి వివరిస్తున్న గ్రామస్తులు

సి.బెళగల్: పాఠశాలలో విద్యార్థులకు సరిపడా టీచర్లు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ మేరకు టీచర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ జ్యోతిని కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామ రెగ్యులర్ పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వరలక్ష్మమ్మను పాఠశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ వచ్చిన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని పాఠశాలలో 471 మంది విద్యార్థులు ఉండగా, 15 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట పది మంది మాత్రమే పనిచేస్తున్నారని వివరించారు. గతంలో 14 మంది ఉండగా ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో నలుగు టీచర్లను ఎంఈఓ ఇతర పాఠశాలలకు డెప్యూటేషన్ వేశారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, వెంటనే టీచర్లను నియమించాలని ఎంఈఓను కోరారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఎంఈఓ విద్యార్థుల తల్లిదండ్రులతో అన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్: మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని కోడుమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ వరలక్ష్మిదేవమ్మ సూచించారు. ఆమె శుక్రవారం ఓ ప్రకటనలో పే ర్కొంటూ.. మండలంలోని సంగాల గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టు, తిమ్మందొడ్డి గ్రామంలో అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సంగాలలోని రెండవ కేంద్రం ఎస్టీ మహిళ, తిమ్మందొడ్డిలో ఆయా పోస్టు ఈడబ్ల్యూఎస్ మహిళకు రిజర్వ్ అయ్యిందని సీడీపీఓ తెలియజేశారు. స్థానికులైన అర్హ త కలిగిన మహిళలు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధృవపత్రాల రెండు సెట్లను గజిటెడ్ అధికారితో సంతకం చేయించి, కోడుమూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వ్యక్తి అరెస్ట్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఎలిసా అలియాస్ భాస్కర్ అనే యువకుడిని కర్నూలు తాలుకా పోలీసులు అరెస్ట్ చేశారు. భాస్కర్ గత మే నెలలో టీజీ గ్రూప్ ఆల్కలీస్ ఫ్యాక్టరీ విస్తరణపై పలు వ్యతిరేక కథనాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడనే ఆరోపణలతో కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి అతడు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో శుక్ర వారం గ్రామ సమీపాన పొల్లాలో ఉన్నాడన్న సమాచారం అందడంతో తాలుకా పోలీసులు అరెస్ట్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సి.బెళగల్: మండలం పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరా యం కలుగుతుందని గూడూరు విద్యుత్ సబ్‌డివిజన్ అధికారులు తెలిపారు. శుక్రవారం వారు ఓ ప్రకటనలో పేర్కొంటూ.. మండలంలోని ఐదు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్వహణ, మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వర కు విద్యుత్ సరఫరాను నిలిపి వేయడం జరుగుతుందన్నారు. దీంతో కొత్తకోట, సి.బెళగల్, గుండ్రేవుల, పోలకల్, బురాన్‌దొడ్డి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సునీల్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాల్వబుగ్గ, ఉయ్యాలవాడ సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ఉయ్యాలవాడ, చింతలపల్లె, కొమరోలు, ఉప్పలపాడు, వెంకటాపురం, కాల్వ, హుసేనాపురం, సోమయాజులపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పంచలింగాల 33 కేవీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున పంచలింగాల నుంచి దేవమాడ వరకు, నిడ్జూరు నుంచి ఎదురూరు వరకు ఆయా గ్రామల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహమ్మద్ ఇస్మాయల్ తెలిపారు.

అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మండలంలోని దుకాణదారులు ఎరువులు, పురుగు మందులను అధిక రేట్లకు విక్రయిస్తే వారి లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పురుగు మందులు, ఎరువుల దుకాణదారులతో స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏఓ రవిప్రకాష్ సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న మందులు, ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి దుకాణదారుడు స్టాక్, ధరల పట్టికను విధిగా ఏర్పాటు చేసుకోవాలని, రైతులు అడిగిన మందులను మాత్రమే విక్రయించాలని, కాలం చెల్లిన మందులు, అనుమతి లేని బయోలను విక్రయించరాదన్నారు. రైతుకు అమ్మిన ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఏఓ దుకాణదారులకు సూచించారు. ఏఈఓ తస్లీం, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌కు స్వాగతం



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న తహసీల్దార్

ఓర్వకల్లు: కర్నూలు జిల్లా నూతన కలెక్టర్ సిరికి రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. కర్నూలులో బాధ్యతలు స్వీకరించడానికి శుక్రవారం విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి సాయంత్రం 4 గంటలకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, స్థానిక తహసీల్దార్ విద్యాసాగర్ కలెక్టర్ సిరికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పాణ్యం: ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. పాణ్యం బస్టాండ్ వద్దనున్న శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్, పెస్టిసైడ్ ఎరువుల దుకాణంలో తని ఖీ చేయగా 58 బస్తాలను నిర్ణీత ధర కంటే రూ.100 ఎక్కువగా విక్రయించినట్లు గుర్తించారు. యూరియా బస్తాలను సీజ్ చేశారు. ఏఓలు జయప్రకాష్‌రెడ్డి, విశ్వనాథ్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కళాకారుల సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కళాకారుల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫీయుల్లా తెలిపారు. ఇటీవల పరమపదించిన వన్నెం బలరాం, కళా సేవకులు కామ్రేడ్ జేఎన్ శేషయ్య సంస్మరణ సభ ఉంటుందని కళాకారులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి నివాళులర్పిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: మండల పరిధిలోని మారందొడ్డి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగభూషణం శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, నాయకులు శుక్రవారం ఉదయం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నరసింహుడు, మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు అస్వస్థత

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి ముందరింటి వెంకటేష్ శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురయ్యాడు. ఇంట్లో ఉండగా ఒంట్లో నలతగా అనిపించడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించి తర్వాత కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పార్టీ నియోజకవర్గ నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, ప్రభాకర్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని వెంకటేష్‌ను పరామర్శించారు. సోమశేఖర్‌రెడ్డి, నాయకులు గోపాల్, మల్లికార్జున ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ఘోర వైఫల్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో ఘోరంగా విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి బీసన్న విమర్శించారు. శుక్రవారం బుగ్గరామేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 10న అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్–సూపర్ హిట్ సభలో కేవలం పొగడ్తలే తప్పా, నిరుద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం కలగలేదన్నారు. ప్రభుత్వం నిజంగా సూపర్ హిట్ అని చెప్పుకుంటే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఎందుకు ఆపలేకపోయిందో, కడప స్టీల్ ప్లాంట్‌ను ఎందుకు సాధించలేకపోయిందో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయలేకపోయిందో, నిరుద్యోగ భృతి అమలు చేయకపోవడమేంటి, ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో స్థానిక యువతకు అవకాశాలు కల్పించకపోవడమేంటి? అని ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న విజయవాడలో నిర్వహించనున్న నిరుద్యోగుల ఆవేదన సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రమాణాలను పెంపొందించండి



ఇనగండ్ల డీఎస్టీ స్కూల్‌లో విద్యార్థులను సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి ఆదేశించారు. ఆమె శుక్రవారం మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామ ప్రాథమిక, డీఎస్టీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రికార్డులు, రిజిస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్కూల్ టీచర్లకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి ఒకటో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అక్షరాలను గుర్తించడంతో పాటు, రాయడం వంటి నైపుణ్యాలను విద్యార్థులలో రాబట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.